నిరుద్యోగులతో కూటమి సర్కార్ బంతాట

- నాడు మెగా డీఎస్సీ అంటూ ప్రగల్భాలు
- అధికారంలోకి వచ్చాక పోస్టుల భర్తీలో తీవ్ర నిర్లక్ష్యం
- అదిగో.. ఇదిగో అంటూ కాలం వెళ్లదీస్తున్న పాలకులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు


శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులు

గాలివీడు: నిరుద్యోగులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న మెగా డీఎస్సీ జాడ కనుచూపు మేరలో కనిపించడం లేదు. గత ఏడాది నవంబర్‌లో అసెంబ్లీ సాక్షిగా విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రకటన తర్వాత డీఎస్సీ గురించి ఎలాంటి ఉలుకు పలుకు లేకపోవడం నిరుద్యోగుల్ని నిరాశకు గురి చేస్తోంది. న్యాయపరమైన వివాదాలకు తావు లేకుండా డీఎస్సీ నోటిఫికేషన్ వెలువరిస్తామని ప్రకటించినా.. ఆ దిశగా ఎలాంటి కదలిక లేదు. గత ఏడాది నుంచి జూన్ 12న కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే సీఎం మెగా డీఎస్సీ ప్రకటనపై సంతకం చేయడంతో నిరుద్యోగుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రభుత్వ ఉద్యోగం కోసం చేస్తున్న ప్రైవేటు ఉద్యోగాలు మానేసి అభ్యర్థులు నెలల తరబడి శిక్షణ పొందుతున్నారు. రోజులు గడుస్తున్నా డీఎస్సీ నిర్వహణపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు.

ఎదురుచూపులు

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ గత ఏడాది నవంబర్ మొదటి వారంలోనే వెలువరించాల్సి ఉంది. నోటిఫికేషన్ వెలువడటానికి ముందు రిజర్వేషన్ల అమలుపై అభ్యంతరాలు రావడంతో డీఎస్సీ నోటిఫికేషన్ నిలిచిపోయింది. మరోవైపు అందరికి ఆమోదయోగ్యంగా, లీగల్ లిటిగేషన్లు లేకుండా నోటిఫికేషన్ ఇస్తామని, పెండింగ్ ఖాళీలు సహా అన్ని ఉద్యోగాలను వచ్చే ఏడాది నాటికి ఉద్యోగాలను భర్తీ చేస్తామని నారా లోకేష్ అసెంబ్లీలో గత ఏడాది ప్రకటించారు. 2024 జనవరిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 6,100 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత నోటిఫికేషన్ రద్దు చేసి దాని స్థానంలో 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఎస్సీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో రిజర్వేషన్లు ఖరారైన తర్వాత కొత్త నోటిఫికేషన్లు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో తాజా నోటిఫికేషన్ విడుదలలో జాప్యం జరుగుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అడ్డంకులు తొలగి ఎప్పుడు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తారోనని అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

పుస్తకాలతో కుస్తీ

డీఎస్సీ నియామకాల్లో ఏళ్ల తరబడి జరుగుతున్న జాప్యం నిరుద్యోగుల్ని నిరాశకు గురి చేస్తోంది. 1994 ముందు టీచర్ రిక్రూట్‌మెంట్ జిల్లాస్థాయిలో జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ నియమాకాలు జరిగేవి. 1994 నుంచి రాష్ట్ర స్థాయిలో డీఎస్సీ జరుగుతోంది. గత ప్రభుత్వంలో డీఎస్సీ 2024 నోటిఫికేషన్ 2024 ఫిబ్రవరి 12న నిరుద్యోగుల్ని మభ్య పెట్టడానికి ఎన్నికలకు ముందు 6,100 పోస్టులతో నోటిఫికేషన్ జారీ చేయగా పరీక్ష జరిగేలోపు ఎన్నికల షెడ్యూల్ వెలువడటం కూటమి సర్కార్ వాటిని రద్దుచేయడంతో కథ మొదటికి వచ్చింది. మరోవైపు డీఎస్సీతో అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకుంటున్న నిరుద్యోగులు నెలల తరబడి శిక్షణా కేంద్రాల్లోనే పుస్తకాలతో కుస్తీలు పడుతున్నారు.

జీవితాలతో చెలగాటం



డీఎస్సీ కోసం ఇప్పటికి రెండుసార్లు కోచింగ్ తీసుకున్నా. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామంటే అందరం నమ్మాం. డిసెంబర్‌లో అన్నారు.. ఫిబ్రవరి కూడా వెళ్లిపోతోంది. నోటిఫికేషన్ ఎప్పుడు ఇస్తారో మాత్రం ఎవరూ చెప్పరు. డీఎస్సీ అభ్యర్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు.

– నరేష్, ఎస్జీటీ అభ్యర్థి, గాలివీడు

రెండేళ్ల నుంచి శిక్షణ తీసుకుంటున్నాం



కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. 16 వేల పోస్టులను భర్తీ చేస్తామని చెప్పారు. రకరకాల సాకులతో వాయిదా వేస్తున్నారు. రెండేళ్ల నుంచి శిక్షణ తీసుకుంటున్నాం డీఎస్సీ నియామకాల్లో ఏళ్ల తరబడి జరగుతున్న జాప్యం నిరుద్యోగుల్ని నిరాశకు గురి చేస్తోంది.ప్రభుత్వ ఉద్యోగం కోసం చేస్తున్న ప్రైవేటు ఉద్యోగాలు మానేసి అభ్యర్థులు నెలల తరబడి శిక్షణ పొందుతున్నారు. రోజులు గడుస్తున్నా డీఎస్సీ నిర్వహణపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో అభ్యర్థులు ఆవేదనచెందుతున్నారు.

– వెంకటరమణ, బీఎస్సీ బీఈడీ, గాలివీడు

ప్రభుత్వ ఆదేశాలు రాగానే..



ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే నియమకాల ప్రక్రియను ప్రారంభిస్తాం. ఇప్పటికే ఖాళీలను గుర్తించడంతో పాటు రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసుకుని త్వరలోనే నోటిఫికేషన్ ఇవ్వడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

– సుబ్రహ్మణ్యం, డీఈఓ, రాయచోటి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజంపేట రూరల్: రాజంపేట పట్టణంతో పాటు కే.బోయినపల్లి, ఆకేపాడు, కట్టకిందపల్లి, హెచ్.చెర్లోపల్లి, తాళ్లపాక సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని శుక్రవారం విద్యుత్‌శాఖ డీఈఈ ఎం .సురేంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. కోరారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

వీరబల్లి: శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయమని రూరల్ సీఐ వరప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం రూరల్ సీఐ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. మండల కేంద్రంలో స్థల వివాదం సీఐ దృష్టికి రావడంతో ఆ స్థలాన్ని పరిశీలించి ఇరు వర్గాలతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

రామాలయానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయానికి రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు అన్వేష్, మండల కార్యదర్శి నరసయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఒంటిమిట్ట మండల కమిటీ సమావేశం నిర్వహించారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు రాము, వెంకటేష్ పాల్గొన్నారు.

వేలం పాట అర్ధరాత్రి నిర్వహించవద్దు


రైతుల సమస్యలపై డీఆర్‌ఓతో మాట్లాడుతున్న రైతుసంఘం నేతలు

రాయచోటి అర్బన్: రాయచోటి మార్కెట్‌లో కూరగాయల వేలంపాటను అర్ధరాత్రి నిర్వహించవద్దని, ఉదయం 5గంటలకు నిర్వహించేలా చూడాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డీఆర్‌ఓ మధుసూదన్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం రంగారెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో ఏర్పడిన పరిస్థితుల కారణంగా కూరగాయల వేలంపాటను వ్యాపారులు అర్ధరాత్రి నిర్వహించడం ప్రారంభించారని తెలిపారు. కరోనా పరిస్థితులు పోయి నాలుగేళ్లు గడుస్తున్నా వ్యాపారులు అదే పద్ధతిన పాటిస్తుండడం దారుణమన్నారు. అర్ధరాత్రి వేలం సమయానికి రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్‌కు చేర్చడం, అక్కడ వాటిని దింపడానికి కూలీలు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వినతిపై డీఆర్‌ఓ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరినాథనాయుడు, బాలకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, దామోదర్‌రెడ్డి, రమణ, మంద కృష్ణ పాల్గొన్నారు.

రాజముద్రలో ఉర్దూభాషకు చోటు కల్పించాలి


షరీఫ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముస్లింలు

రాయచోటి అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజముద్రలో రెండవ అధికారభాష ఉర్దూకు చోటు కల్పించాలని ఏపీ రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల ముఖ్యసలహాదారులు ఎం.ఎ.షరీఫ్‌ను పలువురు ముస్లిం నేతలు కోరారు. సహారా వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి షేక్ ఆఫ్తాబ్ ఆధ్వర్యంలో పలువురు ముస్లింలు షరీఫ్‌ను స్టేట్‌గెస్ట్ హౌస్‌లో కలివారు. వారు మాట్లాడుతూ స్వాతంత్య్ర ఉద్యమంలో ఉర్దూసాహిత్యం ముఖ్యభూమిక పోషించించిదని తెలిపారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర రాజముద్రలో ఉర్దూభాషకు చోటు కల్పించిందన్నారు. అదే తరహాలో ఏపీలో కూడా రాజముద్రలో కూడా ఉర్దూకు చోటుకల్పించాలని కోరారు. ముస్లిం నేతలు జిలాన్‌బాషా, ఇలియాస్‌బేగ్, ఆఫ్జల్ పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారుల నిజాయితీ


ప్రయాణికురాలికి బ్యాగ్‌ను అప్పగిస్తున్న ఆర్టీసీ అధికారులు

రాయచోటి టౌన్ : ఆర్టీసీ అధికారులు నిజాయితీని చాటుకున్నారు. శుక్రవారం వైఎస్సార్ జిల్లా నుంచి అన్నమయ్యజిల్లాలోని రాయచోటి మీదుగా పుంగనూరుకు వెళ్లు ఆర్టీసీ బస్సు రాయచోటి ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకొంది. ఈ బస్సులో ఒక ప్రయాణికురాలు తన బ్యాగ్‌ను మరిచిపోయి దిగిపోయింది. తోటి ప్రయాణికుడు గమనించి ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న అనౌన్సర్ దగ్గరకు వెళ్లి బస్సులో ఉన్న బ్యాగ్‌ను అందజేశాడు. అనౌన్సర్‌గా ఉన్న రోహిణీ సహచర అధికారి ఎం ఎం నాయక్‌తో కలసి బ్యాగ్‌ను తెరిచి చూడగా అందులో బంగారు ఆభరణాలు కనిపించాయి. బ్యాగ్‌లో ఉన్న ఆధారాలతో పోగొట్టుకున్న ప్రయాణికుడిని గుర్తించి ఆ బ్యాగ్‌ను ఈ ప్రయాణికురాలికి అప్పగించారు.

తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు


మాట్లాడుతున్న ఎంపీపీ సుధామాధురి

చిన్నమండెం : వేసవికాలంలో తాగునీటి సరఫరాలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రతిష్టమైన ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని, అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఎంపీపీ సుధామాధురి పేర్కొన్నారు. శుక్రవారం మండల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈఓపీఆర్‌డీ శేఖర్‌నాయక్ మాట్లాడుతూ మండలానికి ఒక జనరిక్ మెడికల్ షాపు బీసీ(ఏ)కి మంజూరైందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి మాట్లాడుతూ మండలంలో దాదాపు అన్ని గ్రామాల్లో నూతనంగా తాగునీ సమస్యలు రాకుండా బోర్లు వేశామని పేర్కొన్నారు. నీటి సమస్యల పరిష్కారం కోసం వివిధ పనులకు రూ.96 లక్షలు మంజూరయ్యాయన్నారు. పీఆర్ జేఈ హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే మండలంలో రూ.4.82 కోట్లతో 42 సీసీ రోడ్ల పనులు చేశామన్నారు. ఇంకా కొన్ని గ్రామాల్లో రోడ్లకు 31 పనులకు రూ.2 కోట్లు మంజూరయ్యాయన్నారు. అనంతరం అన్ని శాఖల అధికారులు వారి శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సమావేశంలో ఎంఈఓ శివానాయక్, పశువైద్యాధికారి గణేష్, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కల్పవృక్ష వాహనంపై వెంకన్న


కల్ప వృక్షవాహనంపై శ్రీదేవి,భూదేవి సమేత వేంకటరమణస్వామి

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ఐదు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. టీటీడీ ఆగమ సలహాదారులు శ్రీనివాసచార్యులు,అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టార్, రమేష్ బాబు, ధనుష్,క్రిష్ణమూర్తిలు శుక్రవారం స్వామి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఉదయం కల్పవృక్ష వాహనంపై శ్రీదేవి,భూదేవి సమేత శ్రీనివాసుడిని ప్రత్యేకం అలంకరించిఊరేగించారు. రాత్రి హనుమంత వాహనం స్వామిని ఊరేగింపు నిర్వహించారు. కల్పవృక్షవాహనంపై భక్తులు స్వామిని దర్శించి తరించారు. టీటీడీ ధర్మప్రచారపరిషత్ ఆధ్వర్యంలో హరికథ, కళాకారులుచే వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలతో భక్తులను అలరింపజేశారు. కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈఓ గోపినాథ్, ఇన్స్‌పెక్టర్ దుష్యంత్‌కుమార్, సిబ్బంది నగేష్, నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సిద్దవటం: ఆటో డ్రైవర్‌లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు. సిద్దవటం పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఆటో డ్రైవర్‌లకు సీఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్‌ను కలిగి ఉండాలన్నారు. ఆటో డ్రైవర్లును పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. వాహనాలను తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని తెలిపారు.

హిందువుల మనోభావాలు పరిరక్షించండి

లక్కిరెడ్డిపల్లి: హిందువుల మనోభావాలను పరిరక్షించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ గజపతి రాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌బీఐ కుర్నూతల బ్యాంక్ సమీపంలో హిందువుల నివాస గృహాల మధ్య ఓ వర్గం అనుమతులు లేకుండా ప్రార్థనా మందిరం నిర్మించిందని, ఆ ప్రార్థనా మందిరాన్ని తొలగించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హిందూ సంఘాల ప్రతినిధులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

హైస్కూల్ వద్ద వ్యర్థాల తొలగింపు


హైస్కూలు వద్ద వ్యర్థాలు తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

గాలివీడు : మండల కేంద్రంలోని స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రవేశం వద్ద వ్యర్థాలను పంచాయతీ సిబ్బంది తాత్కాలికంగా తొలగించారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో పాఠశాలా?.. డంపింగ్ యార్డా? అని వార్తను ప్రచురించాం. దీంతో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. అయితే అక్కడ శాశ్వతంగా వ్యర్థాలు వెయ్యకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, స్థానికులు చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వెయ్యకుండా కనీసం పాఠశాల ఎదుట చెత్తకుండి ఏర్పాటు చేస్తే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉద్యోగులను తొలగించడం అన్యాయం


రిలే నిరాహార దీక్ష చేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్, ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు

ఓబులవారిపల్లె: మంగంపేట ఏపీఎండీసీ పాఠశాలలో తొలగించిన నాన్ టీచింగ్ స్టాఫ్, ఉద్యోగులను తొలగించడం అన్యాయమని సీఐటీయూ నాయకులు అన్నారు. మంగంపేట ఏపీఎండీసీ పాఠశాలలో తొలగించిన నాన్ టీచింగ్ స్టాఫ్ చేపట్టిన రిలే నిరాహార దీక్ష 12 రోజుకు చేరుకుంది. శుక్రవారం ఈ దీక్షలో సీఐటీయూ నాయకులు పాల్గొన్ని వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎటువంటి నోటీసులు లేకుండా తమను ఉద్యోగంలో నుంచి తొలగించడం అన్యాయమని, పన్నెండు రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్న పాఠశాల యాజమాన్యం స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.

గుండెపోటుకు అత్యవసర చికిత్స


లక్కిరెడ్డిపల్లి: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు


సిద్దవటం: మాట్లాడుతున్న డాక్టర్ ప్రకాష్

లక్కిరెడ్డిపల్లి: గుండె జబ్బుల మరణాలను నివారించేందుకు లక్కిరెడ్డిపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రంలో అత్యవసర చికిత్స అందిస్తున్నామని ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ నీలోఫర్ బేగం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులకు వైద్యులు సలహాలు, సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుండె నొప్పి రోగులకు హబ్ అండ్ స్పొక్ విధానంలో రూ. 40 వేలు విలువచేసే ఇంజక్షన్‌ను రోగులకు ఉచితంగా అందిస్తామన్నారు. ఎవరైనా గుండెనొప్పితో వస్తే ఈసీజీ తీసి రోగుల వివరాలు, వారి సమస్యను పెద్ద ఆసుపత్రి (హబ్)కు పంపించడం జరుగుతుందన్నారు. వాటిని వైద్య నిపుణులు పరిశీలించి సదరు రోగికి ఇంజక్షన్ అవసరమో కాదో తెలియచేస్తారని, వారి సూచన మేరకు రోగికి సేవలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు సులోచన, రెడ్డికీర్తి, నిషార్ అహ్మద్, జీవన్ కుమార్, భరత్ రెడ్డి, కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దవటం: గుండె జబ్బుల మరణాలను నివారించేందుకు సిద్దవటం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో అత్యవసర చికిత్స అందిస్తున్నామని సిద్దవటం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ టి. ప్రకాష్ తెలిపారు. సిద్దవటం సిహెచ్‌సీలో శుక్రవారం మండలంలోని మాధవరం, పి. కొత్తపల్లె, సిద్దవటం సీహెచ్‌సీ, అట్లూరు పీహెచ్‌సీలలోని స్టాఫ్ నర్సులకు, ఏఎన్ఎం, ఆశావర్కర్‌లకు గుండెకు సంబంధించిన వ్యాదుల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టి. ప్రకాష్ మాట్లాడుతూ ఎవరైనా గుండెపోటుకు గురైన సందర్భంలో మొదటి గంటలోపు వారికి అందించే చికిత్స ఎంతో కీలకమని, ఆసమయంలో స్పందిస్తే రోగిని ప్రాణాపాయం నుంచి రక్షించుకోవచ్చునన్నారు. గుండెనొప్పి రోగులకు హబ్ అండ్ స్పొక్ విధానంలో రూ. 40 వేలు విలువచేసే ఇంజక్షన్‌ను రోగులకు ఉచితంగా అందిస్తామన్నారు. డాక్టర్ మురళీమోహన్, డాక్టర్ శివాణి, డాక్టర్ శ్రీకావ్య, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న ఐడీబీఐ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ

రాజంపేట టౌన్: విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈఓ–2 సుబ్బరాయుడు అన్నారు. పట్టంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఐడీబీఐ బ్యాంక్ రూ.1.25 లక్షల విలువగల 22 డెస్కులను శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ–2 సుబ్బరాయుడు ముఖ్య అతిథిగా వచ్చి డెస్కులు ఏర్పాటు చేసిన గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా మన్నూరు హైస్కూల్‌కు ఐడీబీఐ బ్యాంక్ డెస్కులు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాజంపేట, కడప ఐడీబీఐ బ్యాంక్ మేనేజర్‌లు సత్యనారాయణ, వాసు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా తమ బ్యాంక్ సేవాకార్యక్రమాలు చేపడుతుందన్నారు. అందులో భాగంగానే మన్నూరు హైస్కూల్‌లోని విద్యార్థుల సౌకర్యార్థం డెస్కులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం కొడూరు పరిమళ, బ్యాంక్ సిబ్బంది వినోద్, సుబ్రహ్మణ్యం, పాఠశాల కమిటీ చైర్మన్ నాగరాజు పాల్గొన్నారు.

రుణాల దరఖాస్తుకు గడువు పొడిగింపు

ఓబులవారిపల్లె: నిరుద్యోగ యువతీ, యువత స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం అందిస్తున్న బీసీ రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 12వ వరకూ గడువు పెంచినట్లు ఎంపీడీఓ మల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, అర్హులైన వారు మీసేవా సచివాలయాలు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పెనగలూరు: బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తు గడువును 12వ తేది వరకు పెంచినట్లు ఎంపీడీఓ విజయారావు తెలిపారు. వివిధ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో మంజూరు చేస్తున్న యూనిట్లకు దరఖాస్తులు ఈనెల 12వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు


ప్రత్యేక అలంకరణలో శ్రీ భద్రకాళీ అమ్మవారు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ అమ్మవారికి శుక్రవారం మహిళ భక్తులు భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు నిర్వహించారు. నిమ్మకాయలపై ఒత్తులు వెలిగించి అమ్మవారికి హారతులు ఇచ్చారు. అనంతరం అమ్మవారిని రంగురంగుల పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, నిమ్మకాయలతో హారాలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రాహుకాల పూజ విశేషాలు వివరించారు. ఈ పూజలలో స్థానిక భక్తులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళలు కూడా పాల్గొన్నారు. ఈ పూజలు ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.


రాహుకాల పూజలు చేస్తున్న మహిళలు

క్లుప్తంగా

నేటి నుంచి పునఃప్రతిష్ట వేడుకలు

రాయచోటి టౌన్ : వందేళ్ల నాటి శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవి అమ్మవారి ఆలయాన్ని పునఃనిర్మించి శనివారం ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. వందేళ్ల క్రితం నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆర్యవైశ్యం సంఘం సభ్యుల ఆర్థిక సహకారంతో ఆలయాన్ని పునఃనిర్మించారు. పునఃప్రతిష్ట పూజలతో పాటు అమ్మవారి మహోత్సవ వేడుకలు శనివారం నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 10వ తేదీన అమ్మవారి యంత్రప్రతిష్ట, విగ్రహప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సిద్దవటం: మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన కామాక్షమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు బ్రహ్మశ్రీ ఓరుగంటి సీతారామశర్మ మాట్లాడుతూ కామక్షమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టతో పాటు ఆలయంలో గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి , సింహ వాహనం, ధ్వజస్తంభం, శిఖర కలశం, శ్రీచక్ర విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. అనంతరం యత్రప్రతిష్ట, ప్రాణప్రతిష్ట, కుంభాబిషేకం, పూర్ణాహుతి నిర్వహించామన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని కాయా కర్పూరం సమరించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

'జీతాలు వెనక్కితీసుకోవడం సరికాదు'

రాయచోటి అర్బన్: రాష్ట్రంలో డిగ్రీ కళాశాల ఉద్యోగుల జీతాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవడం సరికాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.రామాంజులు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019లో 10 రోజులను మినహాయించి ఏప్రిల్, మేనెలల్లో వేతనాలను చెల్లించి ఇదే పద్ధతిని అమలు చేయాలని ప్రభుత్వం 2020, 2021లో ప్రొసిడింగ్స్ అమలు చేసి నోటిపై చేసిందన్నారు. 2019 ఏప్రిల్, మేనెలల్లో కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలను వెనుక్కు తీసుకోవాలంటూ జీఓను విడుదల చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు.

డాక్టరేట్ ప్రదానం


పావని

రాజంపేట టౌన్: రాజంపేట పటణం ఆకులవీధికి చెందిన మల్రిపల్లి గంగయ్యఆచారి, సిద్దమ్మ కుమార్తె మల్రిపల్లి పావనికి యోగివేమన యూనివర్శిటి డాక్టరేట్ ప్రదానం చేసింది. 'ఎలక్ట్రికల్, ఆప్టికల్, స్ట్రక్చరల్ అండ్ మార్ఫలాజికల్ ప్రాపర్టీస్ ఆఫ్ ఎంటర్ జెర్మేనియం' అనే అంశంపై డాక్టర్ ఏ.అశోక్‌కుమార్ పర్యవేక్షణలో పావని రీసెర్చ్ చేసింది. పావని 2017వ సంవత్సరంలో ఎమ్మెస్సీ ఫిజిక్స్‌లో యోగివేమన యూనివర్శిటీ టాపర్‌గా నిలిచి బంగారు పతకాన్ని కూడా పొందారు. పావని డాక్టరేట్ పొందడం పట్ల కుటుంబ సభ్యులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

సన్మానం


జడ్జి ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

రాజంపేట: రాజంపేటలో 3వ అదనపు జిల్లా జడ్జిగా ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో జడ్జిని న్యాయవాదులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్వరన్యాయం కక్షిదారులకు అందించడమే న్యాయమూర్తుల ప్రథమకర్తవ్యమన్నారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి కేశవ, జూనియర్ సివిల్ జడ్జి భార్గవి కూడా బార్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు సుదర్శనరెడ్డి, లక్ష్మీనారాయణ, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జానీ, సీనియర్ న్యాయవాదులు కృష్ణకుమార్, రామచంద్రనాయుడు, కరుణాకర్‌రాజు, గురుప్రతాప్, రమణ, వెంకటసుబ్బయ్య, రమేష్, సుబ్బరాజు పాల్గొన్నారు.

13న షబేబరాత్ పండుగ

మదనపల్లి సిటీ : ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే షబేబరాత్ పండుగ ఈనెల 13వతేదీన జరుపుకోవాలని మదనపల్లె ప్రభుత్వ సర్‌ఖాజీ ఇక్బాల్‌అహ్మద్ తెలిపారు. ఖబ్రస్థాన్ వెళ్లి మృతి చెందిన పూర్వీకుల ఆత్మ శాంతి కోసం ప్రార్థనలు చేయాలన్నారు. ముస్లింలు అందరూ ఈ పండుగ రోజు రాత్రి ప్రత్యేక ప్రార్థనలు చేయాలని కోరారు.